నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 24 జనవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

# మన్యం ప్రజలకు మెరుగైన వైద్యం

## భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



చర్ల సీహెచ్‌సీ వైద్యుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

చర్ల, జనవరి 23 : నియోజకవర్గంలోని ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ఆయన వైద్యుడిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సాయి వర్ధన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సిమాంక్ సెంటర్‌గా ఉన్న ఆస్పత్రిని గత కేసీఆర్ ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసిందన్నారు. ఈ క్రమంలో సీహెచ్‌సీకి అవసరమైన వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరానని అన్నారు. త్వరలోనే సీహెచ్‌సీని అన్ని వసతులతో ప్రారంభించబోతున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చర్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# నేడు ఎంపీ నామా రాక



ఖమ్మం, జనవరి 23 : బీఆర్ఎస్ లోక్ సభాపక్ష నాయకుడు, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి ఖమ్మం జూబ్లీపురలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొంది.

**రేపు దిశ కమిటీ సమావేశానికి నామా**

గురువారం జరిగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దిశ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్ మాలోతు కవితతో కలిసి కమిటీ వైస్ చైర్మన్ అయిన ఎంపీ నామా నాగేశ్వరరావు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై శాఖలవారీగా సమీక్షిస్తారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే సమావేశానికి నామినేటెడ్ సభ్యులు, ఎంపీపీలు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమగ్ర వివరాలతో హాజరుకావాలని ఎంపీ నామా కోరారు.

# పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

## భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల




మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 23 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం, వరంగల్, నల్గొండ శాసన మండలికి జరగనున్న ఎన్నికల కోసం పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నవంబర్-2020 వరకు డిగ్రీ లేదా ఏదేని తత్సమాన విద్యార్హతలలో పట్టభద్రులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 7,486 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని, 2021 పట్టభద్రుల ఎన్నికల్లో 42,679 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారని అన్నారు. ఓటు హక్కు నమోదుకు ఫారం-18 ద్వారా అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవో కార్యాలయాల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి కూడా అవకాశం ఉన్నట్లు చెప్పారు. ఓటు హక్కు నమోదుకు ఫిబ్రవరి 6 చివరి తేదీ అని చెప్పారు. తుది జాబితాను ఏప్రిల్ 4వ తేదీన ప్రకటిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీపీఆర్‌వో శ్రీనివాస్, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెల్యూర్ తగ్గించాలి

- విద్యుత్ బకాయిలను వసూలు చేయాలి
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మామిళ్లగూడెం, జనవరి 23 : ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెల్యూర్స్ తగ్గించి వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పని చేయాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని డీపీఆర్సీ భవనంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెల్యూర్ తగ్గిస్తే సంస్థపై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు సంధ్యారాణి, తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్ఈ సురేందర్, డీఈటీ బాబూరావు, డీఈఈలు, ఏడీఈలు, ఏఈఈలు పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థ అందిస్తున్న సేవలను వినియోగదారులకు మరింతగా చేరువ చేస్తామన్నారు. జిల్లాలో మీటర్లకు దరఖాస్తులు చేసుకున్న వారికి వారంరోజుల్లో కొత్త మీటర్లు మంజూరు చేస్తామని తెలిపారు. సంస్థలో దీర్ఘకాలికంగా ఒకేచోట పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను పార్లమెంట్ ఎన్నికల తరువాత బదిలీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ముందుగా తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104, టీఆర్ఎస్‌కేయూ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఇంజినీర్స్ అసోసియేషన్స్ తమ సమస్యల పట్ల సీఎండీకి వినతిపత్రాలు అందించారు.

# ఖమ్మాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- పరిశుభ్ర నగరంగా పేరు తేవాలి
- అధికారులు ఒత్తిడి లేకుండా పనిచేయాలి
- నగర అభివృద్ధి, సౌకర్యాలపై దృష్టి సారించాలి
- ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలి
- కేఎంసీ సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 23: ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పరిశుభ్ర నగరంగా పేరు తేవాలని సూచించారు. ఖమ్మం నగర అభివృద్ధిపై కేఎంసీ కమిషర్ ఆదర్శ్ సురభి, ఇతర అధికారులతో కలిసి కేఎంసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. శానిటేషన్, టౌన్ ప్లానింగ్ సహా అన్ని విభాగాల్లో ఆదర్శంగా నిలిచేలా ఖమ్మాన్ని తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం నగర జనాభా 4.23 లక్షలకు చేరుకుందని, 69.50 ఎంఎల్‌టీల తాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. అయితే వేసవిలో ఏ ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది వివిధ గ్రాంట్ల కింద రూ.113.24 కోట్లతో 574 పనులు చేపట్టగా అందులో 488 పనులు పూర్తయ్యాయని, 19 పనులు పురోగతిలో ఉన్నాయని, 67 పనులు ఇంకా ప్రారంభించలేదని వివరించారు. పూర్తయిన పనులకు గాను ఇప్పటి వరకు రూ.24.72 కోట్లను చెల్లించినట్లు చెప్పారు. పురోగతిలో ఉన్న పనుల పూర్తికి చర్యలు వేగం చేయాలని ఆదేశించారు. సుడా ద్వారా రూ.45.7 కోట్ల పనులు, పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా డీఎంఎఫ్‌టీ కింద రూ.10 కోట్ల పనులు, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.2 కోట్లు, 15వ ఆర్థిక సంఘం టైడ్ ద్వారా రూ.3.70 కోట్ల పనులు చేపట్టినట్లు వివరించారు. వీటిల్లో కొన్ని పూర్తి కాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయని, ఇంకొన్ని ప్రారంభం కాలేదని వెల్లడించారు. గత ఐదేళ్లలో ట్యాక్సుల ద్వారా రూ.110.53 కోట్లు, అద్దెల ద్వారా రూ.3.78 కోట్లు, ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ.5.10 కోట్లు, టౌన్ ప్లానింగ్, బిల్డింగ్ అనుమతుల ద్వారా రూ.92.56 కోట్లు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.3 కోట్లు, పట్టణ ప్రగతి ద్వారా రూ.55 కోట్లు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.122.84 కోట్లు, నీటి పన్ను ద్వారా రూ.13.01 కోట్లు కలిపి మొత్తంగా రూ.405.82 కోట్ల రెవెన్యూ వచ్చినట్లు తెలిపారు. 2023-24 సంవత్సరానికి రూ.3984.07 లక్షల పన్ను వసూలు డిమాండ్ ఉండగా.. ఇప్పటి వరకు రూ.1751 లక్షలు వసూలు అయినట్లు చెప్పారు. పక్కా ప్రణాళికతో 100 శాతం వసూళ్లు చేయాలని సూచించారు.

**ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి..**

విలువైన ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, ఆక్రమణకు గురైన స్థలాలు, ఎన్నెస్పీ స్థలాలు ఎక్కడ ఉన్నాయి? ఎంత మేరకు ఉన్నాయి? అనే అంశంపై నివేదిక సమర్పించాలని సూచించారు. ఆక్రమణలపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లకారం, ఖానాపురం, మున్నేరు, ధంసలాపురం వద్ద బఫర్ జోన్ డీమార్కు చేశారని, ఆ ప్రాంతంలో నిర్మాణాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో వచ్చే 25 ఏళ్ల అవసరాల ప్లానింగ్‌తో ఏయే ప్రదేశాల్లో రోడ్ల విస్తరణ ఆవశ్యకత ఉందో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కాగా, సమీక్షలో సుడా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌కు మార్పులపై కూడా చర్చించారు. రాష్ట్రం, కేంద్రం నుంచి నిధులు తెస్తామని అన్నారు. అయితే, ప్రాజెక్టుల ద్వారా కల్పించే వినోదానికి ట్యాక్స్ వసూలు చేయాలని, ట్యాక్స్ ద్వారా ఆ ప్రాజెక్టులు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు స్వేచ్ఛగా, ఒత్తిడి లేకుండా పనిచేయాలని సూచించారు. నిబద్ధతతో నగర అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అధికారులు గణేశ్, సురేందర్, సత్యనారాయణ రెడ్డి, రంజిత్, కృష్ణలాల్ పాల్గొన్నారు.

# నేటి నుంచి జేఈఈ మెయిన్

- జిల్లాలోని ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- హాజరుకానున్న 7,960 మంది అభ్యర్థులు
- గంట నిబంధన పక్కాగా అమలు



జిల్లా కో ఆర్డినేటర్ పార్వతీరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 23 : దేశవ్యాప్తంగా ఎన్‌టీఏ ఆధ్వర్యంలో జాయింట్ ఎంట్రన్స్ టెస్ట్(జేఈఈ) మెయిన్-2024 పరీక్షను బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు ఇక్కడికి రానున్నారు. గత అనుభవాల దృష్ట్యా అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జేఈఈ ఎంట్రన్స్ రెండు సెషన్స్‌లో నిర్వహిస్తున్నారు. మొదటి సెషన్‌లో పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్‌లో పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 24న బీఆర్క్ మొదటి విడత పరీక్షకు 1,071 మంది అభ్యర్థులు, ఈ నెల 27, 29, 30, 31, ఫిబ్రవరి ఒకటో తేదీల్లో జేఈఈ మెయిన్ మొదటి విడతకు 7,960 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్ రామసహాయం పార్వతీరెడ్డి తెలిపారు. పరీక్ష నిర్వహించే కేంద్రాల్లో అరగంట ముందే గేట్లు మూసివేస్తారని, గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలనే నిబంధనను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

**పరీక్ష కేంద్రాలు ఇవే..**

నగరంలోని బొమ్మ ఇంజినీరింగ్ కళాశాల, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల, ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విజయ ఇంజినీరింగ్ కళాశాల, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాలుగా పరీక్షలు నిర్వహించనున్నారు.

**అభ్యర్థులకు సూచనలు**

- ప్రభుత్వ గుర్తింపు కార్డుతో బొటన వేలిముద్ర అనుసంధానంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన అనంతరం కంప్యూటర్‌ను కేటాయించనున్నారు.
- ప్రభుత్వ గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ట్రాన్స్‌ఫరెంట్ పెన్, అడ్మిట్ కార్డుతో హాజరుకావాలి.
- పరీక్ష అనంతరం రఫ్ బుక్‌లెట్‌ను డ్రాప్ బాక్స్‌లో వేయాలి.

# పంటల నమోదు పక్కాగా జరగాలి

## జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఖమ్మం రూరల్, జనవరి 23 : యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల అన్నారు. మంగళవారం ముత్తగూడెం గ్రామంలోని రైతులతో కలిసి ఆమె పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పొలాల్లో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని, యాసంగిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా వరి సాగు చేస్తే తగిన ప్రయోజనాలు ఉంటాయన్నారు. మిర్చి తోటలు సాగు చేసిన రైతులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కోత కోసిన మిర్చి పంటను పూర్తిగా ఆరబెట్టిన తర్వాత మార్కెట్‌కు తరలించినట్లైతే ఆశించిన ధర పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఏవో కార్యాలయ ఏవో, టెక్నికల్ అధికారి రాజు, వ్యవసాయ విస్తరణాధికారి ఆదర్శ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# డ్యూయల్ డిగ్రీతో బంగారు భవిష్యత్తు

**మల్టీ స్పెషలైజేషన్ డిగ్రీతో విద్యార్థులకు మంచి కెరీర్**

- 95 శాతం మార్కులొస్తే కేఎల్‌యూలో ఉచిత సీట్లు
- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జే.శ్రీనివాసరావు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే-కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'లక్ష్యం-2024'
- ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలపై
- కొత్తగూడెం కృష్ణవేణి జూనియర్ కాలేజీలో సదస్సు





అవగాహన సదస్సుకు హాజరైన ఇంటర్ విద్యార్థులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 23 : ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఎంచుకునే మార్గంతోనే వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ జే.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇంజినీరింగ్‌లో మల్టీ స్పెషలైజేషన్ డిగ్రీని పూర్తి చేసిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన అన్నారు. 'ఇంటర్ తర్వాత ఏం చదవాలి?' అనే అంశంపై 'లక్ష్యం 2024' పేరిట 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ' సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం కృష్ణవేణి జూనియర్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కృష్ణవేణి కాలేజీలో చదవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఈ కాలేజీకి రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉందని గుర్తు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ.. విద్యార్థులు అత్యున్నత స్థానాలు పొందేందుకు దోహదపడుతోందని అన్నారు. ఇలాంటి కళాశాలలో చేరడం అంటే ఎంతో పుణ్యం చేసుకొని ఉండాలని అన్నారు. సాధారణ స్థాయి విద్యార్థులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం ఈ కాలేజీ గొప్పతనమని అన్నారు. మంచి క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించేందుకు దోహదపడుతున్న అధ్యాపక సిబ్బందిని, యాజమాన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు. అయితే, ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసుకోబోతున్న విద్యార్థులు కనీసం మూడు ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. ఏ యూనివర్సిటీలో చేరాలో నిశితంగా పరిశీలించి పది యూనివర్సిటీలను ఎంచుకోవాలని, అందులో టాప్ 3 యూనివర్సిటీలను ఎంచుకొని మీకు నచ్చిన వాటిలో చేరాలని సూచించారు. తద్వారా తమ భవిష్యత్తును నిర్దేశించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే, డ్యూయల్ డిగ్రీతో కూడా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, ఆన్‌లైన్‌లో ఒక డిగ్రీ చేస్తూనే ఆఫ్‌లైన్‌లో మరొక డిగ్రీ పట్టా సాధించవచ్చని అన్నారు. 95 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు కేఎల్ యూనివర్సిటీలో ఉచితంగా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్య, మంచి కెరీర్ కోసం 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే'తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం లక్కీడ్రా తీసి విద్యార్థినులు, టాపర్లకు ప్రముఖులు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి మూర్తి, హెచ్ఎస్ఆర్ మూర్తి, కృష్ణవేణి జూనియర్ కాలేజీ డైరెక్టర్ మాచవరపు కోటేశ్వరరావు, 'నమస్తే తెలంగాణ' ఖమ్మం యూనిట్ బ్రాంచ్ మేనేజర్ రేనా రమేశ్, అడ్వర్టైజ్‌మెంట్ డిప్యూటీ మేనేజర్ బోయిన శేఖర్‌బాబు, స్టాఫ్ రిపోర్టర్ కాగితపు వెంకటేశ్వరరావు, కృష్ణవేణి కాలేజీ, కేఎల్ వర్సిటీల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి మూర్తి



టాపర్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న డైరెక్టర్లు

## కృష్ణవేణి కాలేజీలో చేరడం మీ అదృష్టం



బీటెక్‌లో ఎలాంటి కోర్సులు తీసుకోవాలి, ఎలాంటి కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకోవాలనే అంశాలపై కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ-నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తంగా సదస్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. కృష్ణవేణి కాలేజీలో చేరడం మీ అదృష్టం. నాణ్యతతో కూడిన విద్య ఇక్కడ దొరుకుతోంది. మారుమూల ప్రాంతాల్లో కృష్ణవేణి కాలేజీ యాజమాన్యం నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించడం అభినందనీయం. కాలేజీలో మొదటి సంవత్సరంలో చదివిన విద్యార్థులకు 60 మందికి 400 మార్కులకు పైగా సాధించడం గొప్ప విషయం. ప్రతీ ఏడాది బైపీసీ నుంచి ఆరు, ఏడు మెడికల్ సీట్లు సాధించడం అంటే మామూలు విషయం కాదు. విద్యార్థులు ఇంటర్‌లోనే ప్రణాళికతో చదివి ఉత్తమ కోర్సుల్లో చేరాలి. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అందించే అవకాశాలు అద్భుతంగా ఉన్నాయి.

**– బొబ్బిలి మూర్తి, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్**

## విద్యా సదస్సులు అభినందనీయం



విద్యా సమాచారానికి సంబంధించిన అవగాహన సదస్సులు గతంలో మెట్రో పాలిటన్ సిటీల్లో నిర్వహించేవారు. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు కేవలం వార్తలనే కాకుండా.. విద్య, ఉద్యోగ సమాచారాలను కూడా అందిస్తున్నాయి. అందులో భాగంగానే మా సంస్థలు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా లక్ష్యం-2024 పేరుతో ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యావకాశాలపై సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాయి.

**– రేనా రమేశ్, బ్రాంచ్ మేనేజర్, నమస్తే తెలంగాణ**

## గతంలో మెట్రో పాలిటన్ సిటీల్లోనే..



గతంలో ఇలాంటి సెమినార్‌లు మెట్రో పాలిటన్ సిటీలు, పెద్ద పెద్ద నగరాల్లో మాత్రమే జరిగేవి. కానీ.. కేఎల్ యూనివర్సిటీ, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో వినూత్నంగా మారుమూల జిల్లాల్లో కూడా ఇలాంటి సదస్సులు నిర్వహించి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యం పూనుకోవడం మంచి పరిణామం. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో విద్యనందించి ఉజ్వల భవిష్యత్తుకు తీసుకెళ్లే విద్యా సంస్థల్లో చేరితే మంచి అవకాశాలు లభిస్తాయి. లక్ష్యం-2024 సదస్సులు మున్ముందు కూడా నిర్వహిస్తే మరింత బాగుంటుంది.

**– మాచవరపు కోటేశ్వరరావు, కృష్ణవేణి కాలేజీ డైరెక్టర్**

## ఎన్నో విషయాలు తెలుసుకున్నా



నేను బీటెక్ సివిల్, మెకానికల్ కోర్సులు చేయాలనుకుంటున్నా. ఈ కోర్సుల్లో అమ్మాయిలు చేరితే భవిష్యత్తు ఉండదని, చాలా కష్టమని అంటున్నారు. వీటిపై వివరణ కావాలని సదస్సు తర్వాత నేను వేదికపై మాట్లాడిన. నా సందేహాలను కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ యూనివర్సిటీ వారు నిర్వహించిన లక్ష్యం-2024 ద్వారా తెలుసుకున్నా. ఎలా చదవాలి, ఎలాంటి కోర్సు తీసుకోవాలో తెలిసింది.

**తేజావత్ ఐశ్వర్య, కృష్ణవేణి కాలేజీ**

## కొత్త విషయాలు నేర్పింది



నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వారు నిర్వహించిన లక్ష్యం-2024 సెమినార్ ఎన్నో కొత్త విషయాలు నేర్పింది. యూనివర్సిటీ డైరెక్టర్ వివరించిన విధానం మాకు బాగా నచ్చింది. ఇంటర్ పూర్తయిన తర్వాత పై చదువుల కోసం ఏ విధంగా ఆలోచన చేయాలనే అంశాలు బాగా అర్థమయ్యాయి. ఇప్పుడు ఎలాంటి సందేహాలు లేకుండా కెరీర్‌లో ముందుకెళ్లేందుకు దోహదపడతాయి.

**-ఎస్‌కే రెహాన్, కృష్ణవేణి జూనియర్ కాలేజీ**